# సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ

- కామారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభారాజు
- జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశంలో పలు ప్రతిపాదనలకు అంగీకారం
- పలువురు సభ్యుల గైర్హాజరు

కామారెడ్డి, డిసెంబర్ 8 : ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని కామారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభారాజు అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ జితేశ్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో 22 మంది జడ్పీటీసీలు పాల్గొనాల్సి ఉండగా 11 మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. 55 అంశాలను ఎజెండాలో చేర్చారు. 12 గంటలకు ప్రారంభమైన సమావేశం 45 నిమిషాల్లోనే ముగిసింది.55 అంశాల్లో డీఆర్డీవో, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, మత్స్య, పశువైద్య, వ్యవసాయ శాఖలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ బీబీపేట్, కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డి, నస్రుల్లాబాద్ మండలం సంగెం, సదాశివనగర్ మండలం తిమ్మాజివాడి, భిక్కనూర్ మండలం తిప్పాపూర్ ఇంగ్లిష్ మీడియం ఉచ్చతర ప్రాథమిక పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా మార్చడానికి జడ్పీ పాలకవర్గం ఆమోదం తెలిపిందనారు. 8 నుంచి పదోతరతి వరకు అప్‌గ్రేడ్ చేసేందుకు సభ్యులు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో 30 గ్రామ పంచాయతీ కొత్త భవనాలు నిర్మించడానికి సభ్యులు అంగీకరించారన్నారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు. సమావేశంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సభ్యులు, వివిధ శాఖల అధికారులు







హైదరాబాద్ సోమాజిగూడ యశోదా దవాఖానలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ శుక్రవారం పరామర్శించారు. దవాఖాన వద్ద ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో మాట్లాడి ధైర్యం చెప్పారు.



బాన్సువాడ ఎమ్మెల్యేగా పోచారం శ్రీనివాసరెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని పోచారం నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఈసీఐఎల్‌కు ఈవీఎంల తరలింపు



ఈవీఎంల తరలింపు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 8 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను శుక్రవారం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ ఈసీఐఎల్ ఫ్యాక్టరీకి తరలించారు. జిల్లాలో ఇటీవల నిర్వహించిన శాసనసభ ఎన్నికల సందర్భంగా మాక్ పోలింగ్, పోలింగ్ సమయాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తిన కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లను మరమ్మతుల కోసం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు తరలించారు. ఈవీఎంల తరలింపు ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షించారు. ముందుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్ తెరిచి, సాంకేతిక సమస్యలు తలెత్తిన ఓటింగ్ యంత్రాలను ప్రత్యేక వాహనంలోకి చేర్చారు. వాహనం హైదరాబాద్ వెళ్తున్న క్రమాన్ని సైతం జీపీఆర్ఎస్ ద్వారా పర్యవేక్షించారు. మార్గమధ్యలో ఎక్కడా ఆగకుండా నేరుగా ఈసీఐఎల్ ఫ్యాక్టరీకి చేరుకునేలా చర్యలు తీసుకున్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం అధికారులు పవన్, సాత్విక్, సంతోష్, జితేందర్ తదితరులు ఉన్నారు.

**స్ట్రాంగ్ రూం పరిశీలన**

కామారెడ్డి,డిసెంబర్ 8 : పని చేయని కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాడ్ యంత్రాలను శుక్రవారం ఈసీఐఎల్ హైదరాబాద్‌కు తరలించినట్లు కామారెడ్డి కలెక్టర్ జితేశ్ పాటిల్ తెలిపారు. కామారెడ్డిలోని స్ట్రాంగ్ రూంను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌కు తాళం వేసి సీజ్ చేశారు. వీరి వెంట ఎన్నికల విభాగం అధికారులు ఉన్నారు.



వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిపిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

### ఎమ్మెల్సీ కవిత చొరవతో

# స్వగ్రామానికి చేరిన గల్ఫ్ బాధితుడు



కుటుంబ సభ్యులతో రాజు

- కంపెనీ వీసా పేరిట ఏజెంట్ మోసం
- మలేషియాలో నెల రోజుల జైలు జీవితం
- కవితకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన బాధితుడు

నవీపేట,డిసెంబర్ 8: బతుకు దెరువు కోసం ఇతర దేశానికి వెళ్లిన ఓ బాధితుడు ఏజెంట్ మోసంతో జైలు జీవితం అనుభవించి చివరికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల చొరవతో స్వగ్రామానికి చేరాడు. మండలంలోని యంచ గ్రామానికి చెందిన నూనె రాజు ఎనిమిది నెలల క్రితం బతకు దెరువు కోసం మలేషియా వెళ్లేందుకు నిశ్చయించుకున్నాడు. చెన్నై నగరానికి చెందిన ప్రకాశ్ అనే ఏజెంట్‌కు రూ. 1.10 లక్షలు చెల్లించాడు. కంపెనీ వీసా ఇప్పిస్తానని నమ్మబలికి విజిట్ వీసా ఇప్పించాడు. మలేషియా వెళ్లిన బాధితుడు అక్కడి కంపెనీ విజిట్ వీసా అని తేల్చడంతో దిక్కుతోచని స్థితిలో పడిపోయాడు. స్వదేశానికి రావడానికి డబ్బులు సైతం లేకపోవడంతో మూడు నెలల అనంతరం అక్కడి ప్రభుత్వం రాజును నెల రోజుల పాటు జైల్లో పెట్టింది. అక్కడ కొంతమందితో ఏర్పడిన ఏర్పడిన పరిచయంతో ఫోన్ ద్వారా యంచ గ్రామ మాజీ ఉప సర్పంచ్ లాలు యాదవ్, ఎంపీటీసీ లలితా సంజీవ్‌కు సమాచారం అందించాడు. వారు ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవిత దృష్టికి తీసుకెళ్లారు. కవిత ఎన్నికల బిజీలో ఉన్నప్పటికీ సొంత ఖర్చుతో అక్కడి పోలీసులకు జరిమానా చెల్లించి స్వదేశానికి రావడానికి ప్రయాణ ఖర్చులు సైతం పంపారు. దీంతో రాజు గురువారం రాత్రి స్వగ్రామానికి చేరుకున్నాడు.

**ఎమ్మెల్సీ కవితకు కృతజ్ఞతలు**

గల్ఫ్ ఏజెంట్ చేతిలో మోసపోయిన తనను స్వగ్రామానికి చేర్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ కవితకు నూనె రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. ఏజెంట్ ప్రకాశ్ మాయలో పడి కంపెనీ వీసా పేరిట మోసపోయానన్నారు. ఈ సందర్భంగా యంచ గ్రామ మాజీ ఉప సర్పంచ్ లాలు యాదవ్, ఎంపీటీసీ లలితా సంజీవ్, భూమయ్య, దీపక్, అతీఖ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు.